సాక్షి
శ్రీకాకుళం

బుధవారం ၊ 5 ၊ ఏప్రిల్ ၊ 2023



లక్ష్యానికి మించి..

మహిళా సంఘాలకు లక్ష్యాలకు మించి రుణాలు అందుతున్నాయి. ప్రభుత్వం అండగా ఉంటోంది.

- 8లో



రోడ్డు ప్రమాదంలో ఒకరు..

మందస మండలంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. మరొకరు గాయపడ్డారు.

- 8లో



మండలం	కనిష్ఠం	గరిష్ఠం			
ఆమదాలవలస	34°	25°	పాతపట్నం	35°	23°
ఇచ్ఛాపురం	34°	22°	రణస్థలం	36°	24°
పలాస	36°	25°	కొత్తూరు	35°	24°
టెక్కలి	34°	26°	నరసన్నపేట	34°	21°
			శ్రీకాకుళం	31°	26°



న్యూస్‌రీల్

డిగ్రీ నాలుగో సెమిస్టర్ రెగ్యులర్ ఫలితాలు విడుదల

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం పరిధిలోని అఫిలియేషన్ డిగ్రీ కళాశాలల నాలుగో సెమిస్టర్ రెగ్యులర్ ఫలితాలను ఎగ్జామినేషన్స్ డీన్ డాక్టర్ ఎస్.ఉదయ్‌భాస్కర్ మంగళవారం విడుదల చేశారు. బీఏలో 2013 మందికి 932, బీబీఏలో 121కి 76, బీసీఏలో 77కి 60, బీకాంలో 1970 కి 630, బీఎస్సీలో 8571 కి 2556 మంది ఉత్తీర్ణత సాధించారు. మొత్తం డిగ్రీ నాలుగో సెమిస్టర్‌లో 12,752 మంది పరీక్షకు హాజరు కాగా, 4254 మంది ఉత్తీర్ణత సాధించగా, 33.36శాతం ఉత్తీర్ణత నమోదైంది. ఫలితాలను జ్ఞాన భూమి వెబ్ సైట్‌లో అందుబాటులో ఉంచారు. రీవాల్యుయేషన్‌కు దరఖాస్తు చేయాలనుకునే విద్యార్థులు 15 రోజుల్లోగా చేసుకోవాలని సూచించారు.

'రక్తపరీక్షల్లో కచ్చితత్వం అవసరం'



ల్యాబ్ రికార్డు పుస్తకాలను అందజేస్తున్న డీఎంహెచ్‌ఓ మీనాక్షి

అరసవల్లి: రక్త పరీక్షల నిర్వహణలో కచ్చితత్వాన్ని ప్రదర్శించాలని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ బి.మీనాక్షి ఆదేశించారు. ఆమె మంగళవారం స్థానిక కార్యాలయంలో ల్యాబ్ టెక్నీషియన్లతో నిర్వహించిన సమీక్షలో మాట్లాడారు. ప్రతి ల్యాబ్ టెక్నీషియన్ రికార్డుల నిర్వహణను కూడా బాధ్యతగా నిర్వహించాలన్నారు. అనంతరం ల్యాబ్ టెక్నీషియన్లకు కొత్త రికార్డులను, గాజు బీకర్లను అందజేశారు. తాజాగా ఆరోగ్య కేంద్రాల పరిధిలో జ్వరాల తీవ్రత పెరగడంతో రక్తపూతలు, రక్త పరీక్షలు ఎక్కువగా చేయాలని సూచించారు. అలాగే ప్రతి ల్యాబ్ టెక్నీషియన్స్ రోజూ ఫారం -ఎల్ ను ఐహెచ్ఐపీలో విధిగా ఫాలోఅప్ చెయ్యాలని, అలాగే ముఖ్యంగా ఫేస్ రికగ్నైజ్ యాప్‌లో హాజరును నమోదు చేసుకునే విధానం అమలు చేయాలని సూచించారు. ఉద్దానం ప్రాంతంలో సీహెచ్‌సీ పరిధిలోని ల్యాబ్ టెక్నీషియన్లు.. రోజుకు కనీసం 60 మందికైనా మూత్రపిండ వ్యాధులకు సంబంధించిన పరీక్షలను చెయ్యాలని, ఈ పరీక్షలకు సంబంధించి సామగ్రి కోసం ఒక నెల ముందుగా ఇండెంట్ పెట్టాలని సీడీఎస్ ద్వారా తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా నివారణాధికారి పీవీ సత్యనారాయణ, మలేరియా కన్సల్టెంట్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

రైల్వే ఉద్యోగాల పేరిట మోసం



కొత్తూరు: రైల్వేలో ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ నమ్మబలికి లక్షలాది రూపాయలు తీసుకుని నిరుద్యోగులను ముంచేసిన ఘటన కొత్తూరు మండలంలో చోటు చేసుకుంది. కొత్తూరు మండలం గురండి గ్రామానికి చెందిన బోర దేవదాసు తన పిల్లలకు రైల్వేలో ఉద్యోగాల కోసం ఒడిశా రాష్ట్రం పర్లాఖిమిడికి చెందిన రిటైర్డ్ ఎక్సైజ్ ఎస్ఐ సిగ్గు సింహాచలంతో ఒప్పందం కుదుర్చుకున్నారు. రూ.3.60 లక్షలు చెల్లించారు. అలాగే కొత్తూరు గ్రామానికి చెందిన డి.రమేష్ కూడా రైల్వే ఉద్యోగం కోసం సింహాచలంకు రూ.1.60 లక్షలు చెల్లించారు. 2010లో వీరు డబ్బులు చెల్లిస్తే ఇప్పటికీ ఉద్యోగాల ఊసు లేదు. గట్టిగా నిలదీస్తే నకిలీ ఉద్యోగ ఆర్డర్‌ను అందజేశారు. దీంతో దేవదాసు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

మిషన్ వాత్సల్య దరఖాస్తుల గడువు పొడిగింపు

కొత్తూరు: మిషన్ వాత్సల్య పథకం మంజూరు కోసం దరఖాస్తు గడువు ఈ నెల 5వ తేదీతో ముగిసినప్పటికీ ఈ నెల 15 తేదీ వరకు పొడిగించినట్లు సీడీపీఓ టి.విమలారాణి మంగళవారం తెలిపారు. గడువు పొడిగించడంతో అంగన్ వాడీ కార్యకర్తలు మరింతగా ప్రజలకు పథకంపై అవగాహన కల్పించి అర్హులందరి చేత దరఖాస్తు చేయించాలని సీడీపీఓ తెలిపారు.

ఆసరా సంబరం

● ఇది చేతల ప్రభుత్వం



పాల్గొన్న మహిళలు (ఇన్‌సెట్లో) మాట్లాడుతున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

ప్రజల జీవన స్థితిగతులు మెరుగుపరచడమే ప్రభుత్వ ధ్యేయమని ఆంధ్రప్రదేశ్ శాసన సభాపతి తమ్మినేని సీతారాం అన్నారు. పట్టణంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో మంగళవారం మహిళా సంఘాలకు ఆసరా మూడో విడత పంపిణీ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తొంభై ఎనిమిది శాతానికి పైగా నెరవేర్చి వైఎస్ జగన్ చరిత్ర సృష్టించారని చెప్పారు. ఇది మాటల ప్రభుత్వం కాదని, చేతల ప్రభుత్వమని ప్రశంసించారు. మంచి చేసే జగన్‌పై తోడేళ్లు విషం చిమ్ముతున్నాయని, వాటి పట్ల జాగ్రత్తగా ఉండాలని అన్నారు. చంద్రబాబు అండ్ కో దుష్ప్రచారాలు తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు.

– ఆమదాలవలస

● మహిళా సాధికారతే సీఎం ధ్యేయం

మహిళల ఆర్థిక సాధికారతకు సీఎం వైఎస్ జగన్ కృషి చేస్తున్నారని జెడ్పీ చైర్ పర్సన్ పిరియా విజయ అన్నారు. ఇచ్ఛాపురంలోని ప్రజాప్రస్థానం విజయవాటిక, వైఎస్సార్ టూరిజం పార్కు ఆవరణలో మంగళవారం నిర్వహించిన వైఎస్సార్ ఆసరా మూడో విడత సంబరాల్లో ఆమె పాల్గొని మాట్లాడారు. పాదయాత్రలో అక్కచెల్లెమ్మల కష్టాలు తెలుసుకున్న వైఎస్ జగన్ వారి ఉన్నతి కోసం నిరంతరం శ్రమిస్తున్నారని అన్నారు.

–ఇచ్ఛాపురం



సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్లకార్డులతో సంతోషం వ్యక్తం చేస్తున్న ద్వాక్రా మహిళలు (ఇన్‌సెట్లో) మాట్లాడుతున్న జెడ్పీచైర్‌పర్సన్ పిరియా విజయ

● మేలు చేసే ప్రభుత్వానికి మద్దతు ఇవ్వండి



హాజరైన మహిళలు (ఇన్‌సెట్లో) మాట్లాడుతున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

ప్రజలకు మేలు చేసే ప్రభుత్వానికి మద్దతు పలకాలని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు కోరారు. ఆయన మంగళవారం కళింగపట్నం సచివాలయం వద్ద ఎంపీపీ గొండు రఘురామ్ అధ్యక్షతన మూడో విడత ఆసరా పంపిణీ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. చంద్రబాబు తన హయాంలో జన్మభూమి కమిటీల పేరిట ఊరికి నలుగురు బ్రోకర్లను తయారు చేశారని, ఇప్పుడు వారికి కమీషన్లు లేక దినదినగండంగా మారిందన్నారు. వారి మాటలు నమ్మి మోసపోవద్దని కోరారు. ఆనాడు చంద్రబాబు రుణమాఫీపై మాట ఇచ్చి తప్పారని, సీఎం వైఎస్ జగన్ మాత్రం ఇచ్చిన మాట ప్రకారం 'ఆసరా' పేరుతో డబ్బులు అందిస్తున్నారని చెప్పారు. అమ్మ ఒడి అందిస్తుండడంతో పాటు బడులను బాగు చేయించారని గుర్తు చేశారు. ఇన్ని సంక్షేమ పథకాలు 2019లో జనాలు వైఎస్సార్ సీపీకి ఓటు వేయడం వల్లనే సాధ్యమయ్యాయని అన్నారు.

– గార

బహుముఖి పరపతి

- కేంద్ర పథకానికి జిల్లా ఎంపిక
- పైలెట్ ప్రాజెక్ట్‌గా 7 పీఏసీఎస్‌లలో అమలు





సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: జిల్లాలో పీఏసీఎస్‌ల దశ తిరగనుంది. అధికారుల నుంచి ఎలాంటి ప్రతిపాదన లేకపోయినా కేంద్రం ఒక మహత్తర ప్రాజెక్టు కోసం జిల్లాను ఎంపిక చేసుకుంది. ఆహార ధాన్యాల స్టోరేజ్, కలెక్షన్ కోసం దేశ వ్యాప్తంగా అమలు చేస్తున్న సహకారి అన్ బండారన్ యోజన(సబ్‌య) కింద మన జిల్లాను మినిస్ట్రీ ఆఫ్ కోఆపరేటివ్ ఎంపిక చేసింది. దేశ వ్యాప్తంగా 12 జిల్లాలను ఎంపిక చేయగా అందులో శ్రీకాకుళం జిల్లాకు చోటు లభించింది. ఈ మేరకు డీసీసీబీ అధికారులకు తాజాగా సమాచారం అందింది.

మల్టీ సర్వీసు సెంటర్లుగా..



- గ్రామ స్థాయిలో ఉన్న ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలను మల్టీ సర్వీసు సెంటర్లుగా తీర్చిదిద్దాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది.
- రాష్ట్రంలో ఇప్పటికే ఈ పని సమర్థంగా జరుగుతోంది. పీఏసీఎస్‌ల కంప్యూటరీకరణ, రైతు భరోసా కేంద్రాలు, కమ్యూనిటీ హైరింగ్ సెంటర్లు, గోడౌన్ల నిర్మాణం తదితర కార్యక్రమాలను చేపడుతోంది.
- ఇదే ఆలోచనతో కేంద్ర సహకార శాఖ కూడా మల్టీ సర్వీసు సెంటర్లుగా పీఏసీఎస్‌లను అభివృద్ధి చేయాలని అడుగులు వేస్తోంది.
- అందులో భాగంగా సహకారి అన్ బండారన్ యోజన(సబ్‌య)అమలు చేస్తోంది. పీఏసీఎస్‌ల స్థాయిలో ఆహార ధాన్యాల గోడౌన్ల నిర్మాణం, వివిధ యాంత్రీకరణ యూనిట్లతో కస్టమ్స్ హైరింగ్ సెంటర్లు, కలెక్షన్ సెంటర్లు, గ్రేడింగ్ అండ్ సార్టింగ్స్ యూనిట్లను ఏర్పాటు చేసేందుకు ఈ కార్యక్రమాన్ని అమల్లోకి తెస్తోంది.



పైలెట్ ప్రాజెక్ట్‌గా..

మినిస్ట్రీ ఆఫ్ కోఆపరేటివ్ అమలు చేయనున్న సబ్‌య కార్యక్రమానికి మన జిల్లా ఎంపికైనట్టు సమాచారం వచ్చింది. దానికి సంబంధించిన విధివిధానాలు రావాల్సి ఉంది. ఆహారధాన్యాల స్టోరేజ్, గ్రేడింగ్, తదితర అంశాల ప్రాతిపదికన ఈ కార్యక్రమం అమలు జరగనుంది. పీఏసీఎస్‌లను మల్టీ సర్వీస్ సెంటర్లుగా రైతులకు అందుబాటులో తేవాలన్నదే ప్రధాన ఉద్దేశ్యంగా తెలుస్తోంది. జిల్లాలోని ఏడు పీఏసీఎస్‌ల్లో పైలెట్ ప్రాజెక్టుగా అమలు కానుంది.

– కె.వరప్రసాద్, నాబార్డు డీడీఎం, శ్రీకాకుళం

ఏడు బ్లాకుల్లో ఏడు..

ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల(పీఏసీఎస్)ను మరింత పటిష్టం చేసేందుకు అమలు చేస్తున్న సబ్‌యలో భాగంగా దేశ వ్యాప్తంగా 12 జిల్లాలను ఎంపిక చేయగా, అందులో మన జిల్లా కూడా ఉంది. రాష్ట్రంలో ఒక్క మన జిల్లాకే చోటు దక్కింది. జిల్లాలోని ఏడు బ్లాక్‌లలో పైలెట్ ప్రాజెక్టుగా ఒక్కో బ్లాక్ నుంచి ఒక్కో పీఏసీఎస్‌ను అభివృద్ధి చేయనుంది. జిల్లాలో ఆహార ధాన్యాల స్టోరేజ్ సమస్య ఉంది. అవసరమైన గోడౌన్లు లేక ఇబ్బందులు పడుతున్న పరిస్థితి ఉంది. అదే విధంగా ఆహార ధాన్యాల సేకరణ, గ్రేడింగ్ తదితర విషయాల్లో కూడా మరింత చురుగ్గా ఉండేలా పీఏసీఎస్‌లను తీర్చిదిద్దనుంది. కేంద్ర ప్రభుత్వ నిధులతో నాబార్డు రీఫైనాన్సింగ్ కింద వీటిని అభివృద్ధి చేయనున్నట్టు సమాచారం. ఇప్పటికే అధికారులకు వచ్చిన సమాచారం మేరకు ఏడు బ్లాక్‌ల్లో ఒక్కో పీఏసీఎస్‌ను ఎంపిక చేసే పని లో యంత్రాంగం నిమగ్నమైంది. ఎక్కడెక్కడ ఏమేమి అవసరమో గుర్తించే పనిలో పడింది. అంతేకాకుండా వీటి అభివృద్ధి కోసం స్థలం కూడా అవసరం ఉంటుంది. వాటి అన్వేషణ కూడా జరుగుతోంది.

- దీనికి సంబంధించి ఇంకా విధివిధానాలు తయారు చేసే పనిలో మినిస్ట్రీ ఆఫ్ కో ఆపరేటివ్ ఉంది.

జోరుగా పింఛన్ల పంపిణీ



శ్రీకాకుళం పాతబస్టాండ్ : జిల్లాలో పింఛన్ల పంపిణీ జోరుగా జరుగుతుంది. బ్యాంకు సెలవుల కారణంగా సోమవారం మధ్యాహ్నం నుంచి పింఛన్ల పంపిణీ మొదలైంది. వలంటీర్లు లబ్ధిదారుల వద్దకు వెళ్లి పింఛన్లు అందిస్తున్నారు. శ్రీకాకుళంలోని 24 వ వార్డులో సరస్వతికి వృద్ధాప్య పింఛన్‌ను వలంటీర్ మణి ఇలా అందించారు.

అన్న సమారాధనలో ఎస్పీ



భక్తులకు అన్న ప్రసాదాలు వడ్డిస్తున్న ఎస్పీ రాధిక

ఎచ్చెర్ల క్యాంపస్: శ్రీరామ నవమి వేడుకల్లో భాగంగా ఎచ్చెర్ల ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీస్ క్వార్టర్స్‌లోని కోదండరామ ఆలయం ఆవరణలో మంగళవారం అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఎస్పీ జీఆర్ రాధిక అన్న ప్రసాదాన్ని వడ్డించారు. పోలీస్ క్వార్టర్స్, సమీప ప్రాంతాల్లోని భక్తులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

ఏడున్నర దశాబ్దాల జ్ఞాపకం



75 ఏళ్లు పూర్తిచేసుకున్న కోటబొమ్మాళి బాలుర హైస్కూల్ కార్యాలయ భవనం

కోటబొమ్మాళి: ఒకటా రెండా.. డెబ్బై ఐదేళ్లు గడిచిపోయాయి. వేల సంఖ్యలో విద్యార్థులు ఈ బడి ఒడి వదిలి బయటకు వెళ్లి ఉన్నత స్థాయికి ఎదిగారు. ఈ భవనం మాత్రం అన్నింటికీ సాక్షిగా అలా నిలిచిపోయింది. కోటబొమ్మాళిలోని బాలుర హైస్కూల్ కార్యాలయ భవనాన్ని 1948 ఏప్రిల్ 4న ప్రారంభించారు. కోటబొమ్మాళికే చెందిన పట్నాయకుని వెంకటేశ్వరరావు సొంత నిధులతో ఈ భవనాన్ని నిర్మించారు. ఇప్పటికీ ఈ భవనంలో పాఠశాల కార్యాలయం నడుపుతున్నారు. బడి రికార్డుల పరంగా స్కూల్ 75 ఏళ్ల పూర్తి చేసుకుందని హెచ్ఎం పోలినాయుడు తెలిపారు.

అరసవల్లి సబ్‌స్టేషన్‌లో 'ఆదిత్య' ఫీడర్



అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయం

అరసవల్లి: ప్రత్యక్షదైవం అరసవల్లి శ్రీసూర్యనారాయణ స్వామి వారి సన్నిధిలో విద్యుత్ శాఖ ఒక ఫీడర్‌కు 'ఆదిత్య' అనే పేరు పెట్టింది. ఈ క్షేత్రానికి వస్తున్న భక్తుల సౌకర్యార్థం విద్యుత్ శాఖ ఎన్నో పనులను చేసింది. ప్రత్యేకంగా ఆలయానికి 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసింది. ప్రధాన రోడ్డుకు అడ్డంగా విద్యుత్ లైన్లు లేకుండా చర్యలు చేపట్టింది. ముఖ్యంగా అండర్ గ్రౌండ్ విద్యుత్ లైనింగ్ కూడా ఏర్పాటు చేసింది. కలెక్టరేట్ రోడ్డు కొత్తపేటలో ఉన్న సబ్‌స్టేషన్‌ను ఎప్పటి నుంచో 'అరసవల్లి సబ్‌స్టేషన్'గా పరిగణిస్తున్న విద్యుత్ శాఖ.. తాజాగా ఈ సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న 4 ఫీడర్ల (11 కెవి)లో ఒకటైన ట్రాన్స్‌వరల్డ్ గార్నెట్ ఇండస్ట్రీ (టిజిఐ) ఫీడర్‌ను ఆదిత్య ఫీడర్‌గా మార్చుతూ నిర్ణయం తీసుకుంది. అచ్చెన్నపాలెం వద్ద ఉన్న టీజీఐ ఫ్యాక్టరీ మూసివేయడంతో ఆ పేరు స్థానంలో 'ఆదిత్య' పేరును చేర్చారు. దీంతో అరసవల్లి సబ్‌స్టేషన్ పరిధిలో కలెక్టరేట్ ఫీడర్, అరసవల్లి ఫీడర్, కిల్లిపాలెం ఫీడర్‌తో పాటు ఆదిత్య ఫీడర్ ఉంది. దీనిపై ఈఈ బయ్యన్నాయుడు మాట్లాడుతూ...అరసవల్లి క్షేత్ర ప్రాముఖ్యతను మరింత బ్రాండ్ చేసేందుకే 11 కేవీ ఫీడర్‌కు 'ఆదిత్య' పేరును పెట్టామని స్పష్టం చేశారు. భవిష్యత్‌లో కూడా మరింత ప్రాధాన్యత ఇవ్వనున్నట్లుగా ప్రకటించారు.

పరీక్షలు సజావుగా జరగాలి: వీసీ



విద్యార్థినితో మాట్లాడుతున్న వీసీ వెంకటరావు

ఎచ్చెర్ల క్యాంపస్: వర్సిటీ పరిధిలో పరీక్షలు సజావుగా నిర్వహించాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావు అన్నారు. వర్సిటీ నిర్వహిస్తున్న పీజీ సెమిస్టర్ పరీక్షల నిర్వహణ తీరును మంగళవారం పరిశీలించారు. ఏర్పాట్లు, ప్రశ్న పత్రాల భద్రత, పరీక్ష గదులకు తరలింపు, మాస్ కాపీయింగ్ నియంత్రణకు తీసుకుంటున్న చర్యలు పరిశీలించారు. విద్యార్థులతో నిర్వహణ ఏర్పాట్లు అడిగి తెలుసుకున్నారు.

డిగ్రీ రీవాల్యుయేషన్ ఫలితాలు విడుదల

డయల్ యువర్ విశ్వవిద్యాలయం కార్యక్రమంలో ఎక్కువగా ఫిర్యాదులు రావటంతో మంగళవారం డిగ్రీ రీవాల్యుయేషన్ ఫలితాలను విడుదల చేశారు. డిగ్రీ, నాలుగు ఆరు సెమిస్టర్ల రీవాల్యుయేషన్ ఫలితాలు విడుదల చేశారు. విద్యార్థులకు మార్కుల జాబితాలు అందజేయనున్నారు. డిగ్రీ నాలుగో సెమిస్టర్‌లో 144 మంది విద్యార్థులకు 60 మంది, ఆరో సెమిస్టర్‌లో 532 మంది విద్యార్థులకు 136 మంది ఉత్తీర్ణత సాధించారు. అలాగే బీఆర్ఏయూ పరిధిలో డిగ్రీ రెండు, నాలుగు సెమిస్టర్ల జవాబు పత్రాల మూల్యాంకనం నిర్వహించిన ఎగ్జామినర్లకు రెమ్యునరేషన్ మంగళవారం విడుదల చేశారు.

ఎందుకంత కక్ష..?

- పేదల ఇళ్లపై టీడీపీ గూండాగిరీ
- అర్ధరాత్రి జగనన్న కాలనీలో ఇళ్లను కూల్చేసిన వైనం
- కన్నీరుమున్నీరైన లబ్ధిదారులు
- దండుగోపాలపురంలో ఉద్రికత



కూల్చేసిన ఇళ్ల ముందు లబ్ధిదారుల ఆందోళన

సంతబొమ్మాళి: పేదలకు ఒక గూడు వస్తుంటే టీడీపీ నాయకులు చూసి ఓర్వలేకపోతున్నారు. ప్రభుత్వ సాయంతో సొంతిల్లు కట్టుకుంటున్న పేదలపై ప్రతాపం చూపిస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. దండుగోపాలపురంలో సర్వే నంబర్ 214–3సిలో 23 సెంట్లు ప్రభుత్వ భూమి ఉంది. ఆ భూమిపై టీడీపీ నాయకుల కన్నుపడడంతో వారు ఆక్రమించుకున్నారు. అయితే ఆ స్థలాన్ని జగనన్న కాలనీకి ఇవ్వడానికి అధికారులు ప్రతిపాదించారు. దీంతో ఆక్రమణల చెర నుంచి విడిపించి అక్కడ ఏడుగురు పేదలకు జగనన్న ఇళ్ల పట్టాలను అందజేశారు. లబ్ధిదారులు గొనప సునీత, కోత అమ్మోజీ, నొపడ తవిటమ్మ, బస్వల తులసమ్మ, గోరుబండ తులసమ్మ, బస్వల మహాలక్ష్మిలు అక్కడ ఇళ్లు నిర్మించుకుంటున్నారు. పిల్లర్లు, పునాదులు, కొంత వరకు గోడ నిర్మాణం చేపట్టి ఒక్కొక్కరు రూ.లక్షా 50వేల వరకు ఖర్చు చేశారు. అయితే స్థలాన్ని ఆక్రమించిన టీడీపీ నాయకులు దారుణానికి ఒడిగట్టారు. సోమవారం అర్ధరాత్రి దాటిన తర్వాత పొక్లెయినర్‌తో ఆ ఇళ్లను కూల్చేశారు. మంగళవారం ఉదయం కూలిపోయిన ఇళ్లను చూసి లబ్ధిదారులు కన్నీరుమున్నీరయ్యారు. ఈ విషయం స్థానిక సర్పంచ్ మార్పు అశోక్ చక్రవర్తి, వైస్ ఎంపీపీ పి.తులసమ్మకు తెలియడంతో సంఘటన స్థలానికి చేరుకొని లబ్ధిదారులను ఓదార్చారు. గ్రామంలో ఉద్రిక్త పరిస్థితి నెలకొనడంతో టీడీపీ నాయకులు ఇళ్లకు తాళాలు వేసుకుని పరారయ్యారు. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా టెక్కలి సీఐ చంద్రమౌళి ఆధ్వర్యంలో 100 మందితో పోలీసు బందోబస్తు నిర్వహించారు. టెక్కలి ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు ప్రోద్బలంతో మాజీ సర్పంచ్ ఆరంగి వసంతరావు ఆధ్వర్యంలో పేదల ఇళ్ల కూల్చివేత జరిగిందని, వెంటనే అరెస్టు చేసి లబ్ధిదారులకు న్యాయం చేయాలని వైఎస్సార్‌సీపీ నాయకులు, గ్రామస్తులు కోరుతున్నారు.

14 మందిపై కేసు నమోదు

ఇళ్ల కూల్చివేతపై బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు 14 మందిపై కేసు నమోదు చేసినట్లు సంతబొమ్మాళి ఎస్ఐ మధుసూదనరావు తెలిపారు. టీడీపీకి చెందిన మాజీ సర్పంచ్ ఆరంగి వసంతరావు, బెండి విష్ణు, బెండి సూర్యనారాయణ, రాము, అరుణ్‌కుమార్. కై లాష్, ప్రదీప్, అనీల్, బాలక ప్రసాద్, నారాయణ, పొందల సురేష్, మధు, ఆరంగి శ్రీధర్, హరి నిందితులుగా ఉన్నారు.

మాపై ప్రతాపమా..



జగనన్న కాలనీలో పట్టా ఇచ్చారని ఎంతో సంబరపడ్డాము. ఆనందంతో ఇళ్లు కట్టుకుంటున్నాం. మా ఆశపై టీడీపీ నాయకులు నీళ్లు చల్లారు. అర్ధరాత్రి మా ఇళ్లు కూల్చి మాలాంటి పేదలపై ప్రతాపం చూపడం దారుణం.

– కోత అమ్మోజీ, లబ్ధిదారు, దండుగోపాలపురం

లక్షా యాభై వేలు ఖర్చు చేశాం



జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణానికి ఇప్పటి వరకు రూ. 1,50,000 లు ఖర్చు చేశాం. ఇప్పుడు టీడీపీ నాయకులు కూల్చివేశారు. ఈ నష్టం ఎవరు ఇస్తారు. మా బతుకులపై దాడులు చేయడం దుర్మార్గం.

– గొనప సునీత, లబ్ధిదారు, దండుగోపాలపురం

'ఫేస్‌బుక్ పరిచయాలతో జాగ్రత్త'

నరసన్నపేట: ఆన్‌లైన్ మోసాలు, ఫేస్‌బుక్ పరిచయాలపై మొబైల్ వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని నరసన్నపేట సీఐ డి.రాము అన్నారు. స్థానిక జట్టు కళాశీ సంఘ భవనం వద్ద స్ఫూర్తి కార్యక్రమంలో భాగంగా.. నిత్యం జరుగుతున్న మోసాలపై ప్రజలకు అవగాహన కలిగించేందుకు వీలుగా వీధి నాటకాలను మంగళవారం రాత్రి ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆన్‌లైన్ మోసాలు జరుగుతున్న తీరును వివరించారు. అలాగే ఫేస్‌బుక్ పరిచయాలతో యువతీ యువకులు ఎలా మోసపోతున్నారనేది వివరించారు. వీధి నాటకాల్లో కూడా ప్రజలు మోసపోతున్న విధానాలను వివరించారు. అలాగే పిల్లల వ్యవహార శైలిని తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు గమనించి, అనుమానం వస్తే ప్రశ్నించాలని అన్నారు. లేకపోతే పిల్లలు చెడు వ్యసనాలకు బానిసలై పోలీసు కేసుల్లో ఇరుక్కుంటారని హెచ్చరించారు. వీరిని ఎప్పుడూ ఒక కంట కనిపెడుతూ ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ వై.సింహాచలంతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

కేన్సర్ బాధిత చిన్నారికి రూ.70వేలు సాయం



కేన్సర్ బాధిత చిన్నారి కుటుంబానికి సాయం అందిస్తున్న ఎస్‌జీఎఫ్ సంస్థ సభ్యులు

కంచిలి: మండలంలోని పెద్దశ్రీరాంపురం గ్రామానికి చెందిన ఐదేళ్ల బాలుడు లండ యోగేంద్రపై దాతలు ప్రేమ చూపిస్తున్నారు. బాలుడి కేన్సర్ చికిత్స కోసం తమ వంతు ఆర్థిక సాయం అందిస్తున్నారు. ఉద్దానానికి చెందిన ఎస్‌జీఎఫ్ స్వచ్ఛంద సేవా సంస్థ దాతల నుంచి విరాళాలు సేకరించి రూ.70వేల మొత్తాన్ని బాలుని కుటుంబానికి మంగళవారం అందజేశారు. చిన్నారి చికిత్స కోసం మరింత మంది దాతలు స్పందించి, ముందుకు రావాలని కోరారు.

సచివాలయ సిబ్బందికి దిశా నిర్దేశం



మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ వెంకట్రామన్

పాతపట్నం: ప్రతి పేదవాడికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు చేరవేసే బాధ్యత సచివాలయ సిబ్బందిపై ఉందని, సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేయడం వల్ల పరిపాలన సులభతరమైందని జెడ్పీ సీఈఓ ఆర్.వెంకట్రామన్ అన్నారు. పాతపట్నం వెలుగు కార్యాలయంలో పాతపట్నం, మెళియాపుట్టి, సారవకోట మండలంలో పనిచేస్తున్న సచివాలయ ఉద్యోగులకు నిర్వహణ, విధులు–బాధ్యతలపై మంగళవారం జెడ్పీ సీఈఓ సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు అందించాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. డిజిటల్ అసిస్టెంట్లు, కార్యదర్శులు సమన్వయంతో పనిచేయాలన్నారు. పనిచేయకపోతే వేటు తప్పదన్నారు. జీఎస్‌డబ్ల్యూఎస్ జిల్లా నోడల్ అధికారి, సలాన వాసుదేవరావు, టెక్కలి డీఎల్‌డీఓ అలివేలు మంగమ్మ, పాతపట్నం, మెళియాపుట్టి, సావరకోట మండలాల ఎంపీడీఓలు జయంత్ ప్రసాద్, చంద్రకుమారి, విశ్వేశ్వరరావులు, ఏఓ కె.అప్పలనాయుడు, ఈఓపీఆర్డీ ప్రసాద్ పండాలు పాల్గొన్నారు.

టెక్కలి ఆస్పత్రి సిబ్బందిపై డీసీహెచ్‌ఎస్ అసహనం

టెక్కలి రూరల్: స్థానిక జిల్లా ఆస్పత్రిలో విధులు నిర్వర్తిస్తున్న ప్రసూతి విభాగం సిబ్బంది తీరుపై జిల్లా ప్రాంతీయాస్పత్రుల సమన్వయకర్త డాక్టర్ జె.భాస్కరరావు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఆదివారం అర్ధరాత్రి మందస మండలం హొన్నాలి గ్రామానికి చెందిన గిరిజన మహిళ దేవకి నాయక్‌తో ఇక్కడి సిబ్బంది ప్రవర్తించిన వైనంపై పత్రికల్లో వార్తలు వచ్చిన నేపథ్యంలో ఆయన సిబ్బంది తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ముగ్గురు సిబ్బందికి మెమోలు జారీ చేయాలని, ఈ ఘటనపై లిఖితపూర్వక వివరణ ఇవ్వాలని సూపరింటెండెంట్ డాక్టర్ సూర్యారావును ఆదేశించారు. ఇలాంటి ఘటనలు మళ్లీ పునరావృతమైతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సింగుపురంలో కబడ్డీ పోటీలు



పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

శ్రీకాకుళం రూరల్: మండలంలోని సింగుపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో మంగళవారం కబడ్డీ పోటీలు ప్రారంభమయ్యాయి. 16 జట్లు పాల్గొన్నాయి. ఈ నెల 6 వరకూ ఈ పోటీలు జరగనున్నాయి. ఉమా హాటకేశ్వర కబడ్డీ సంఘం అధ్యక్షుడు గొండు శంకర్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ పోటీల్లో హాటకేశ్వర కబడ్డీ సంఘం అధ్యక్షుడు సాయికుమార్, సెక్రటరీ సాధు శ్రీను, సర్పంచ్ ఆదిత్యనాయుడు పాల్గొన్నారు.

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	59,670–00
బంగారం(22సి. 10గ్రా.)	54,700–00
వెండి (కిలో)	76,000–00

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 420.00
విజయనగరం	రూ. 424.00
శ్రీకాకుళం	రూ. 424.00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹113	₹196	₹ 206

లక్ష్యానికి మించి..



డ్వాక్రా సంఘం(ఫైల్)

- మహిళలకు అండగా నిలుస్తున్న వైఎస్ జగన్ సర్కారు
- సకాలంలో రుణాలు అందిస్తున్న వైనం
- సంఘాల బలోపేతం దిశగా చర్యలు

శ్రీకాకుళం పాతబస్టాండ్: మహిళల ఆర్థిక సాధికారతకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండదండలు అందిస్తోంది. అన్ని పథకాలు, సంక్షేమాలను మహిళల పేరిటే అందిస్తున్న వైఎస్ జగన్ సర్కారు మహిళా స్వయం శక్తి సంఘాలకు లక్ష్యానికి మించి రుణాలు అందజేసి వారి ఉన్నతికి తోడ్పడుతోంది. గత ప్రభుత్వం హయాంలో ఉన్న రుణాలను దశల వారీగా ఆసరా పేరిట చెల్లించడంతో పాటు, కొత్త రుణాలు మంజూరు చేస్తోంది.

మహిళలకు జగనన్న తోడు, ఆసరా, ఉన్నతి, స్త్రీ నిధి, బ్యాంకు రుణాలు, గృహ నిర్మాణ రుణాలు, ఇలా పలు రకాల రుణాలు ఇస్తున్నారు. 2022–23 ఆర్థిక సంవత్సరంలో ఈ రుణాలు వంద శాతం కంటే ఎక్కువగా జిల్లాలో మంజూరు చేశారు. ఒక ఏడాదిలోనే లక్ష్యాలను మించి స్త్రీ నిధి, బ్యాంకు లింకేజీ, ఉన్నతి, ఏఎంఎఫ్‌ఎం రుణాలు రూ. 1589.98 కోట్లు మహిళా సంఘాలకు అందజేశారు. దీంతో మహిళా సంఘాలన్నీ బలోపేతమవుతున్నాయి. దీనిపై డీఆర్‌డీఏ పీడీ డాక్టర్ విద్యా సాగర్ మాట్లాడుతూ సిబ్బంది నిబద్ధత వల్లే లక్ష్యాలను చేరగలిగామని తెలిపారు. ఈ ఏడాది మరింత ఎక్కువగా మహిళలకు సాయం చేసేందుకు కృషి చేస్తామని చెప్పారు.

వంద శాతం కంటే ఎక్కువ..

- స్త్రీనిధి రుణాలు జిల్లాలో గత ఏడాది రూ.168 కోట్లు లక్ష్యంగా తీసుకున్నారు. అయితే ఏడాది పూర్తయ్యే సమయానికి రూ.171 కోట్లు రుణాలు అందజేసి, 39,620 మంది మహిళలకు వారి వృత్తులు, వ్యాపారాలకు ఆర్థిక సాయం అందజేశారు. మొత్తం 102 శాతం లక్ష్యాన్ని ఛేదించారు.
- మహిళా సంఘాలకు అందజేసే బ్యాంకు లింకేజీలు గత ఏడాది రూ.1242 కోట్లు లక్ష్యం కాగా.. ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి రూ.1405.81 కోట్లు అందజేశారు. దీని ద్వారా 25,226 సంఘాలకు రుణం అవకాశం కల్పించి 109 శాతం లక్ష్యం సాధించారు.
- ఎస్సీ, ఎస్టీ మహిళలకు ఆర్థిక స్వావలంబన కోసం ఏర్పాటు చేసిన ఉన్నతి పథకం ద్వారా రూ.10 కోట్లు లక్ష్యంగా పెట్టుకోగా.. ఏడాది ముగిసే సరికి ఆ లక్ష్యాన్ని సాధించారు. 2942 మంది మందికి ఆర్థిక ప్రయోజనం చేకూర్చారు.
- పీఎంఎఫ్‌ఎంఈ పథకంలో (ప్రధాన మంత్రి ఫార్మలైజేషన్ ఆఫ్ మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్‌ప్రైజెస్) ద్వారా జిల్లాకు 105 యూనిట్లకు రూ.3.18 కోట్ల వ్యయం లక్ష్యం కాగా.. ఏడాది చివరకు 105 యూనిట్లను అందజేసి రూ.1.18 కోట్లు వ్యయం చేసి, 105 మందికి ప్రయోజనం చేకూర్చారు.

అంబరాన్నంటిన సంబరం



గజముద్దను మోస్తున్న జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ

సోంపేట: మండలంలోని గొల్లగండి పంచాయతీ రామయ్యపట్నం గ్రామంలో నిర్వహించిన శ్రీశ్రీశ్రీ గారమ్మ అమ్మవారి సంబరాల్లో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ మంగళవారం పాల్గొన్నారు. అనంతరం అమ్మవారిగా భావించే గజముద్దను తలపై పెట్టుకుని నడిచారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవాల్లో ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్, జెడ్పీటీసీ తడక యశోద, మండల కమిటీ అధ్యక్షుడు తడక జోగారావు, మత్స్యకార కార్పొరేషన్ డైరెక్టర్ మద్దు రాజారావు, బట్టి మాధవరావు, పాడుగు కామేష్, మెట్ట దుర్యోధన, గ్రామస్తులు పాల్గొన్నారు.

● ఘటాలతో అపురూప ఘట్టాలు



అంపోలు గ్రామదేవత పండగ మంగళవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ప్రతి ఇంటి నుంచి ఒక ఘటం బయల్దేరగా, గ్రామంలో తిరువీధి నిర్వహించారు. అనంతరం ఆలయం వద్దకు చేరుకుని అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక చిన్నారులు చేసిన కోలాటం ఆకట్టుకుంది. పలు సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. ఆలయ అనువంశిక ధర్మకర్త విస్సాప్రగడ హరినాథరావు, యువత పాల్గొన్నారు. –గార

కాలువలో కారు



కాలువలో దిగిపోయిన కారు

పోలాకి: మండల కేంద్రానికి ఆనుకుని ఉన్న గంగివలస వద్ద వంశధార కాలువలో ఉదయం ఒక కారు దర్శనమిచ్చింది. సోమవారం రాత్రి పోలాకి వైపు నుంచి పిన్నింటిపేట వైపు వెళ్తున్న ఒక కారు అదుపు తప్పి కాలువలో పడిపోయింది. మంగళవారం ఉదయం కారును బయటకు తీసి తరలించేశారు. దీనిపై ఎస్‌ఐ నర్సింహమూర్తి వద్ద ప్రస్తావించగా దీనిపై ఎవరూ ఫిర్యాదు చేయలేదన్నారు. కొందరు యువకులు మద్యం మత్తులో డ్రైవింగ్ చేస్తూ అతివేగంతో కారు నడపటం వల్లనే ఇలా జరిగిందని స్థానికులు చెబుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

- మరొకరికి తీవ్ర గాయాలు



ప్రమాదంలో మరణించిన సంగారు నాగేశ్వరరావు



ప్రమాదంలో బోల్తాపడిన ట్రాక్టర్

మందస: మండలంలోని భిన్నళమదనాపురం సమీపంలో గల జాతీయ రహదారిపై మంగళవారం వేకువజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో సంగారు నాగేశ్వరరావు(33) అనే వ్యక్తి మరణించగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. సోంపేట మండలం బారువా గ్రామం, కుమ్మరిపేటకు చెందిన సంగారు నాగేశ్వరరావు(33) కొత్తగా ట్రాక్టర్ కొనుగోలు చేశారు. ఆ వాహనాన్ని శ్రీకాకుళం నుంచి స్వగ్రామానికి తన పెదనాన్న కుమారుడితో కలిసి తీసుకెళ్తున్నారు. తోడుగా వచ్చిన వ్యక్తి పేరు కూడా సంగారు నాగేశ్వరరావే కావడం గమనార్హం. వేకువజామున భిన్నళమదనాపురం సమీపంలో వెనుక నుంచి గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో ట్రాక్టర్ పొలాల్లోకి వెళ్లిపోయి బోల్తా పడింది. ప్రమాదంలో ట్రాక్టర్ నడుపుతున్న సంగారు నాగేశ్వరరావు అక్కడికక్కడే మృతి చెందాడు. మరో నాగేశ్వరరావుకు తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదం జరిగినప్పుడు అక్కడే ఉన్న ఒక వ్యక్తి 108కు సమాచారం అందివ్వడంతో మందస 108 అంబులెన్స్ సిబ్బంది జి.శంకర్, వి.మురళీమోహన్ హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని.. గాయపడిన వ్యక్తిని సోంపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

మరణించిన నాగేశ్వరరావు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పలాస ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుని భార్య మోహిని ఫిర్యాదు మేరకు మందస ఎస్‌ఐ వై.రవికుమార్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

'మెగా డీఎస్సీలో పీఈటీ పోస్టులు భర్తీ చేయాలి'

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ):

మెగా డీఎస్సీ నోటిఫికేషన్ ద్వారా ఉపాధ్యాయ, పీఈటీ పోస్టులు భర్తీ చేయాలని జాయింట్ కలెక్టర్ మల్లారపు నవీన్‌ను ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయకార్యదర్శి యుగంధర్, జిల్లా ప్రధానకార్యదర్శి శ్రీనివాసరావులు కోరారు. ఈ మేరకు మంగళవారం జేసీని కలిసి వినతిపత్రం అందించారు. గత కొన్నేళ్లుగా పీఈటీలకు డీఎస్సీ నోటిఫికేషన్ రాకపోవడం వల్ల నిరుద్యోగంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. వయసు మించిపోతే నిరుద్యోగులుగా మారే అవకాశం ఉందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో నాడు–నేడు పేరుతో కోట్లాది రూపాయలు ఖర్చు పెడుతున్న నేపథ్యంలో మెరుగైన విద్యను అందించాలంటే ఉపాధ్యాయ, పీఈటీ పోస్టులు భర్తీ చేయడం ఎంతో అవసరమన్నారు. ప్రభుత్వం అనుకున్న వంద శాతం అక్షరాస్యత సాధించాలని, లక్ష్యం నెరవేరాలంటే ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పీఈటీ పోస్టులు భర్తీ చేయడమే ఏకైక మార్గమన్నారు.

'దుష్ప్రచారాలు తిప్పి కొట్టాలి'



చింతాడ రవికుమార్

ఆమదాలవలస: రాష్ట్రంలో టీడీపీ, ఎల్లో మీడియా చేస్తున్న దుష్ప్రచారాలను సమర్థంగా తిప్పికొట్టాలని వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు పార్టీ ప్రచార విభాగం జోనల్ ఇన్‌చార్జి చింతాడ రవికుమార్ కోరారు. ఆమదాలవలసలో గల జగనన్న ప్రజా సేవా కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ మధ్య కాలంలో జగనన్న ఢిల్లీ పర్యటన గురించి, మంత్రి వర్గ విస్తరణ, ముందస్తు ఎన్నికలు, పోలవరం ప్రాజెక్ట్ తదితర విషయాలపై టీడీపీ, దాని అనుకూల మీడియా చేస్తున్న విష ప్రచారాలను ప్రజలందరూ గమనించాలని రవికుమార్ కోరారు. ఇదంతా టీడీపీ ఎన్నికల ప్రచారంలో భాగమని, అలాగే రాష్ట్ర ప్రజలను అయోమయంలోకి నెట్టాలనే ప్రయత్నమని తెలిపారు. ఈ విష ప్రచారాలను కార్యకర్తలు తిప్పికొట్టాలన్నారు. 2024లో జగనన్న మళ్లీ ముఖ్యమంత్రి కావడం చారిత్రాత్మక అవసరమని అన్నారు.

స్వామి శరణం..



కాగితంపై చెక్కిన అయ్యప్పస్వామి ప్రతిమ

కాశీబుగ్గ: అయ్యప్ప స్వామి జన్మ నక్షత్ర వేడుకల సందర్భంగా పలాస–కాశీబుగ్గకుచెందిన కొత్తపల్లి రమేష్ ఆచారి కాగితంపై స్వామి రూపాన్ని సర్జికల్ బ్లేడ్ సాయంతో తీర్చిదిద్దారు. దీని తయారీకి సుమారు రెండు గంటల సమయం పట్టినట్లు తెలియజేశారు.

నేటి నుంచి చెవిటమ్మ తల్లి ఉత్సవాలు



చెవిటమ్మ తల్లి అమ్మవారు

హిరమండలం: హిరమండలంలో వెలసి ఉన్న చెవిటమ్మ తల్లి వార్షికోత్సవాలు బుధవారం నుంచి నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆదివారం వరకు ఐదు రోజుల పాటు ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ప్రతి రోజు దీపారాధన, అర్చన, కుంకుమ పూజలు, హోమం వంటి విశేష పూజలు నిర్వహిస్తామన్నారు.

నీలమణి దుర్గ ఉత్సవాలకు పోలీసు బందోబస్తు



సీఐ వినోద్‌బాబు వినతిపత్రం అందజేస్తున్న గ్రామ పెద్దలు

పాతపట్నం: పాతపట్నం గ్రామ దేవత నీలమణి దుర్గ అమ్మవారి ఉత్సవాలు మే నెల 21 నుంచి 30 వరకు జరగనున్నాయని, ఉత్సవాలకు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని పాతపట్నం సీఐ ఎం.వినోద్‌బాబు, ఎస్‌ఐ ఎస్.కామేశ్వరరావులను పాతపట్నం గ్రామ పెద్దలు కోరారు. ఈ మేరకు గ్రామ పెద్దలు పాతపట్నం పోలీస్ స్టేషన్‌కు మంగళవారం వెళ్లి సీఐకు, ఎస్‌ఐకు, తహసీల్దార్ ఎం.రవిచంద్రకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ గ్రామ ఉత్సవాలకు తమ సహకారం అందజేస్తామని, పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసి, ట్రాఫిక్, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పాతపట్నం గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

వైభవంగా దొంగదోపు ఉత్సవం



తోట మండపంలో విశ్రాంతి తీసుకుంటున్న ఆదిత్యుని కల్యాణమూర్తులు



ఆళ్వారు, ఆదిత్యుని వర్గాల మధ్య సంవాదం చేసుకుంటున్న అర్చకులు

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి వార్షిక కల్యాణ మహోత్సవాల్లో భాగంగా మంగళవారం సాయంత్రం 'దొంగ దోపు ఉత్సవం' ఆకట్టుకుంది. ఆలయ ఉద్యానవన తోటల్లో జరిపించిన ఈ వేడుకల్లో భాగంగా ఆలయం నుంచి ఉత్సవమూర్తులను వెండి సింహ వాహనంపై తిరువీధిగా ఊరేగించి, స్థానిక చిన్న ఉద్యానవన తోటలో ఉంచారు. మరో ఉద్యానవన తోట (పెద్ద తోట)లో శ్రీ తిరుమంగయాళ్వారు చరిత్రలో భాగంగా ఆళ్వారును వేంచేసింపజేశారు. ఈ సందర్భంగా ఆళ్వారుకు, ఆదిత్యునికి మధ్య జరిగిన సంవాదం భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది. వసంత రుతువులో కల్యాణం అనంతరం స్వామి వారు, తన దేవేరుల సమేతంగా ఉద్యానవనాల్లో విహరించే సందర్భంలో ఆళ్వారు సృష్టించిన పలు ఇబ్బందికర పరిస్థితులపై కలత చెందిన ముగ్గురు భార్యల సూచన మేరకు ఆదిత్యుడు ఆళ్వారుతో సంవాదానికి దిగుతారు. ఈ నేపథ్యాన్ని తీసుకుని ఆదిత్యుని తరపున భాస్కరభట్ల నర్సయ్యశర్మ, బంకుపల్లి రమేష్‌శర్మ, ఆళ్వారు తరపున భాస్కరభట్ల శ్రీరామమూర్తి శర్మ, డాక్టర్ పులఖండం శ్రీనివాసరావులు సంవాదం చేసుకున్నారు. అనంతరం తోట ఉద్యానవనంలో ఉన్న ఆదిత్యున్ని ఉత్సవ కల్యాణమూర్తులకు మహా హారతి, ప్రసాద నివేదన చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ వి.హరిసూర్యప్రకాష్, ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ తదితరులు పాల్గొన్నారు.

నేడు పుష్పయాగం

ఆదిత్యుని కల్యాణ మహోత్సవాలు బుధవారంతో ముగియనున్నాయి. చైత్ర శుద్ధ పౌర్ణమి సందర్భంగా ఉదయం కల్యాణ మూర్తులకు చక్రతీర్థ స్నానాలు నిర్వహిస్తారు. సాయంత్రం ధ్వజావరోహణం జరుగుతుందని, రాత్రి పుష్పయాగం నిర్వహిస్తారని ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ తెలియజేశారు.

గంజాయి నిర్మూలనకు ప్రత్యేక చర్యలు : ఎస్పీ



సెబ్ అధికారుల సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ రాధిక

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాలో పూర్తిస్థాయిలో గంజాయి నిర్మూలనకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఎస్పీ జీఆర్ రాధిక స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో విభాగం అధికారులను ఆదేశించారు. ఆమె మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంటు బ్యూరో జాయింట్ డైరెక్టర్ ఎంవీ నాగమణికంఠతో కలిసి నెలవారీ సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలో సెబ్, పోలీసు శాఖ సమన్వయంతో పనిచేసి సరిహద్దు ప్రాంతాల నుంచే కాకుండా జాతీయ రహదారులు, మారుమూల ప్రాంతాల్లో గంజాయి అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా పెట్టాలన్నారు. పార్సిల్ సర్వీసెస్, ట్రాన్స్‌పోర్టు కార్యాలయాలు తరచూ తనిఖీ చేసి ఎలాంటి అక్రమ రవాణాకు అవకాశం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి పార్సిల్ క్షుణ్ణంగా తనిఖీ చేశాకే అనుమతించేలా, రికార్డులు పక్కాగా ఉండేలా నిర్వాహకులు చర్యలు తీసుకునేలా చూడాలన్నారు. ప్రతి అంశాన్ని రికార్డుల్లో పొందుపర్చాలన్నారు. గ్రామాల్లో నాటుసారా విక్రయాల కేంద్రాలను గుర్తించి ఆయా ప్రాంతాల్లో రైడ్స్, కార్డన్ అండ్ సెర్చ్ నిర్వహించి నాటుసారా తయారీకి వినియోగించే ముడిపదార్థాలు అక్రమ రవాణా అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. సమావేశంలో ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ కేపీ గోపాల్ ఎక్సైజ్ సూపరింటెండెంట్లు, సీఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

నేడు ద్విచక్రవాహనాల వేలం

పాతపట్నం: ప్రహరాజపాలేంలోని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(ఎస్‌ఈబీ) ఆధ్వర్యంలో వివిధ కేసుల్లో పట్టుబడిన బైక్‌లను బుధవారం ఉదయం పది గంటలకు ప్రహరాజపాలేంలోని ఎస్‌ఈబీ స్టేషన్ వద్ద వేలం వేయనున్నట్లు ఎస్‌ఈబీ సీఐ వై.లక్ష్మునాయుడు మంగళవారం ఓ ప్రకటనలో తెలియజేశారు. ఆసక్తి ఉన్నవారు ఈ నెల 5వ తేదీ ఉదయం 9గంటలకు ఆధార్ జిరాక్సుతో పాటు రూ.1000 ముందస్తుగా చెల్లించి, వేలంలో పాల్గొనవచ్చునని సీఐ పేర్కొన్నారు.

కెమికల్ పరిశ్రమల్లో అప్రమత్తత అవసరం



స్మార్ట్ కెం పరిశ్రమలో ప్రమాద సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై డెమో నిర్వహిస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల క్యాంపస్: కెమికల్ పరిశ్రమల్లో ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎన్‌డీఆర్‌ఎఫ్ కమాండర్ సుశాంత్ కుమార్ బెహరా అన్నారు. పొన్నాడలోని స్మార్ట్ కెం టెక్నాలజీస్ కెమికల్ పరిశ్రమలో మంగళవారం విపత్తుల ముందస్తు నియంత్రణ, విపత్తుల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమం, డెమో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కెమికల్ పరిశ్రమల్లో ప్రమాదాలు జరిగితే ప్రాణనష్టంకు అవకాశం ఉంటుందని తెలిపారు. పరిశ్రమల్లో పూర్తిస్థాయిలో అంతర్జాతీయ ప్రమాణాలతో భద్రతా చర్యలు ఉండాలని సూచించారు. భద్రత కిట్ల వినియోగం, అందుబాటులో ప్రాథమిక చికిత్సకు వైద్య సౌకర్యాలు, అన్ని సౌకర్యాలతో అంబులెన్స్ సిద్ధంగా ఉంచటం వంటి చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం, పరిశ్రమ సీనియర్ జనరల్ మేనేజర్ చంద్రశేఖర్‌రావు పాల్గొన్నారు.